సాక్షి
నిర్మల్

ఆదివారం । 5 । మార్చి । 2023



సో'ఫా'లో' మీడియా..! 8లో▸

సోషల్ మీడియాకు ఉన్న క్రేజీని సద్వినియోగం చేసుకుంటున్నాయి రాజకీయ పార్టీలు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రజాప్రతినిధులు, నాయకులు సోషల్ మీడియా ఖాతాల నిర్వహణపై దృష్టి సారించారు.



నేడు గురుకుల సీవోఈ సెట్

ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీవోఈ) ప్రవేశ అర్హత పరీక్ష నేడు నిర్వహించనున్నారు. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0/19.0

ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయి. పగలు ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి ప్రభావం ఉండదు.

న్యూస్‌రీల్

కష్టపడి చదివితే లక్ష్యం సాధ్యం



విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు ఇస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చు కలెక్టర్ వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక చాణక్య కాలేజీ ఆవరణలో బీసీ సంక్షేమ హాస్టళ్లలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షలకు ఎలా సిద్ధం కావాలనే అంశంపై అవగాహన కల్పించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పరీక్షల్లో విజయం సాధించేలా సబ్జెక్టు నిపుణులు విద్యార్థులకు బోధించాలని సూచించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి లోకేశ్, డీఈవో రవీందర్‌రెడ్డి, వివిధ సబ్జెక్టు నిపుణులు, బీసీ సంక్షేమశాఖ అధికారులు గంగాధర్, ఖాలిక్, హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

నర్సరీలపై ప్రత్యేక దృష్టి సారించాలి



టెంబరేణి నర్సరీని పరిశీలిస్తున్న రాంబాబు

నర్సాపూర్(జి): నర్సరీలపై ప్రత్యేక దృష్టి సారించాలని అడిషనల్ కలెక్టర్ రాంబాబు సూచించారు. మండలంలోని టెంబరేణి, రాంపూర్ గ్రామాలను శనివారం సందర్శించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున నర్సరీల్లోని మొక్కలకు మూడుపూటలా నీరు అందించాలని సూచించారు. టెంబరేణి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం కోసం సరఫరా అయిన బియ్యాన్ని, ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, క్రీడా ప్రాంగణాలను పరిశీలించారు. ఆయన వెంట టెంబరేణి సర్పంచ్ దత్తు, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, ఏపీవో సుగుణ, పంచాయతీ కార్యదర్శులు శైలజ, నవనీత్‌కుమార్ తదితరులున్నారు.

బస్టాండ్లలోని దుకాణాలకు టెండర్లు

నిర్మల్‌టౌన్: నిర్మల్ డిపో పరిధిలోని నిర్మల్, ఖానాపూర్, సారంగపూర్ బస్టాండ్లలో ఖాళీగా ఉన్న వివిధ దుకాణా సముదాయాల కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ సాయన్న శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు ఈ నెల 13న నిర్మల్ డిపో కార్యాలయంలో దరఖాస్తు ఫారాలు పొందాలని పేర్కొన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈఎండీతో సహా 'అకౌంట్స్ ఆఫీసర్, టీఎస్ఆర్టీసీ, ఆదిలాబాద్' పేరిట డీడీ తీసి ఈ నెల 14న మధ్యాహ్నం 2గంటల్లోగా అందజేయాలని సూచించారు. అదేరోజు 3గంటలకు టెండర్ ప్రక్రియ మొదలవుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు 73828 42265 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



కాంగ్రెస్ పోరుయాత్రలో భాగంగా పార్టీ కార్యకర్తలతో కలిసి నడుస్తున్న మహేశ్వర్‌రెడ్డి

పోరు జోరు..!

- కార్నర్ మీటింగ్‌లో కాంగ్రెస్ జోష్
- భారీగా తరలివచ్చిన కార్యకర్తలు
- ఆద్యంతం ఊపుపెంచిన నేతలు

నిర్మల్: వరుస ఓటములతో స్తబ్దుగా మారిన కాంగ్రెస్‌లో తెలంగాణ పోరుయాత్ర కొంత జోష్ నింపుతోంది. భైంసాలో శుక్రవారం ప్రారంభ సభకు అంతంత మాత్రంగా కార్యకర్తలు హాజరయ్యారు. కానీ.. రెండోరోజైన శనివారం సాయంత్రం నిర్మల్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వరుసగా రెండుసార్లు ఓడిపోయినా తనకంటూ ఇప్పటికీ బలమైన క్యాడర్ ఉందని పార్టీ అగ్రనేతల ముందు మహేశ్వర్‌రెడ్డి నిరూపించుకున్నారు. భారీగా వచ్చిన కార్యకర్తలను చూసి నేతలు ఆద్యంతం వారిలో ఊపునింపేలా ఉత్సాహపరిచారు.

చాలారోజుల తర్వాత..

రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి జిల్లాకు వచ్చినప్పుడు భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. ఆ తర్వాత ఆ స్థాయి కార్యక్రమాలను కాంగ్రెస్ నిర్వహించలేదు. కొంతకాలంగా ఎన్నికల్లో వరుస ఓటములతో పాటు ప్రత్యర్థి పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలు వరుసగా సభలు, యాత్రలు చేయడం కూడా కాంగ్రెస్ క్యాడర్‌ను కుంగదీస్తూ వచ్చాయి. రాష్ట్ర పార్టీ కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తున్న మహేశ్వర్‌రెడ్డి స్థానికంగా ఎక్కువ సమయం ఇవ్వకపోవడమూ క్యాడర్‌లో నిరుత్సాహాన్ని నింపింది. ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ నిస్తేజంగా మారిన హస్తం శ్రేణులకు పోరు యాత్ర ఓ బూస్ట్‌లా పని చేస్తుందని చెప్పవచ్చు.

మంత్రిని లక్ష్యం చేసుకుని ఆరోపణలు

భైంసా సభలో ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు చేసిన కాంగ్రెస్ నేతలు నిర్మల్ మీటింగ్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని టార్గెట్ చేశారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి ఐకే రెడ్డి ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదని, ఎంత సేపూ కబ్జాలపైనా దృష్టిపెడుతున్నారని ఆరోపించారు. తనదైన రీతిలో మంత్రిపై ఏలేటి విరుచుకుపడ్డారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సైతం ఇంద్రకరణ్‌రెడ్డిని ఇంటికి పంపే సమయం ఆసన్నమైందని అనడంతో కార్యకర్తల నుంచి భారీ స్పందన వచ్చింది.

గెలిస్తే.. ఏలేటికి పెద్ద పదవి

రానున్న ఎన్నికల్లో గెలిచే దాకా కాంగ్రెస్ శ్రేణులు ఇదే జోష్‌తో ఉండాలని పార్టీ సీనియర్లు పిలుపునిచ్చారు. ఏఐసీసీ నేత నదీం జావెద్ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో నిర్మల్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయమైందని, ఇక ఉమ్మడి జిల్లాలోని మిగతా తొమ్మిది స్థానాలను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి ఉన్నతమైన పదవి వస్తుందని ప్రకటించారు. నిర్మల్ నియోజకవర్గంలో మైనార్టీలు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. వారంతా సెక్యులర్ పార్టీగా ఉన్న కాంగ్రెస్ వెంట ఉండాలని నేతలంతా కోరారు. మీటింగ్‌లో వీహెచ్ ఉర్దూలో మాట్లాడుతూ.. మైనార్టీలను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. నదీం జావెద్ ఉర్దూ కవితలు చెప్పడం సభికులను ఆకట్టుకుంది. వంటగ్యాస్ సిలిండర్ ధర పెంపు, పింఛన్లు, డబుల్‌బెడ్రూం ఇళ్లపై సభకు వచ్చిన ఓ మహిళతో మాట్లాడించారు.



వేదికపై ఏలేటితో కలిసి అభివాదం చేస్తున్న కాంగ్రెస్ అగ్ర నేతలు



కార్నర్ సమావేశానికి హాజరైన కార్యకర్తలు

'మహిళలపై వివక్ష సరికాదు'

నిర్మల్‌టౌన్: దేశంలో మహిళలపై వివక్ష ఇంకా కొనసాగుతోందని, ఇది సరికాదని తెలంగాణ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ముడుపు నళిని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నళిని మాట్లాడుతూ.. సమాజంలో మహిళలపై హింస కొనసాగుతుందనడానికి మెడికో ప్రీతి మరణమే కారణమని చెప్పారు. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. మద్యం, బెల్ట్‌షాపుల కారణంగా పేద కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయని తెలిపారు. బెల్ట్‌షాపులకు వ్యతిరేకంగా మహిళలు పోరాటం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అనంతరం వివిధ రంగాల్లో పేరుపొందిన మహిళలను సన్మానించారు. తెలంగాణ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మకుమారి, ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి శశికళ, అంగన్‌వాడీ టీచర్స్, మినీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్, మెడికల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం, 'మధ్యాహ్న' కార్మిక సంఘం సభ్యులున్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న నళిని

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

కుంటాల: శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేయాలని భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ సుభాష్ పోలీసులకు సూచించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తంజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాల అదుపునకు కృషి చేయాలని, చోరీలు జరగకుండా గ్రామాల్లో గస్తీ నిర్వహించాలని సూచించారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. భైంసా రూరల్ సీఐ చంద్రశేఖర్, ఎస్సై సాయికిరణ్ తదితరులున్నారు.

8న మహిళా క్లినిక్‌లు ప్రారంభం

- వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు
- వివిధ అంశాలపై అధికారులతో వీసీ

నిర్మల్‌చైన్‌గేట్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 8న రాష్ట్రంలోని 100 ఆరోగ్య కేంద్రాల్లో మహిళా క్లినిక్‌లు ప్రారంభించనున్నట్లు వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. హైదరాబాద్ నుంచి ఆయన పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి ఆరోగ్య మహిళ, సీపీఆర్ శిక్షణ, కంటివెలుగు, వడ్డీ లేని రుణాలు తదితర అంశాలపై శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా క్లినిక్‌లలో మహిళలకు ఎనిమిది ప్యాకేజీల్లో 57 రకాల పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో 19 ఏళ్ల యువకుడు పెళ్లి వేడుకలో గుండెపోటుతో మరణించాడని, ఇలాంటి సమయంలో సీపీఆర్‌తో బాధితుల ప్రాణాలు కాపాడవచ్చని పేర్కొన్నారు. జిల్లాకు ఐదు నుంచి ఏడు మాస్టర్ ట్రైయినర్లను అందుబాటులో ఉంచి రోజుకు కనీసం 300 మందికి సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చేలా కలెక్టర్లు పర్యవేక్షించాలన్నారు. కంటివెలుగు కింద ప్రిస్క్రిప్షన్ కళ్లద్దాలను సకాలంలో పంపిణీ చేయాలని సూచించారు. రెండేళ్లకు సంబంధించి పావలా వడ్డీ బకాయిలు రూ.650 కోట్ల నిధులను ఈనెల 8న విడుదల చేస్తామని చెప్పారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్, అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్వో లోకేశ్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి ధన్‌రాజ్, డీపీవో శ్రీలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఎస్పీ, అధికారులు

'పది' విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

లక్ష్మణచాంద: పదో తరగతి విద్యార్థులకు తప్పనిసరిగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని డీఈవో రవీందర్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం మండలంలోని వడ్యాల్, లక్ష్మణచాంద ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల ముగిసిన ప్రీఫైనల్ పరీక్షలపై విషయాల వారీగా రివ్యూ చేశారు. అనంతరం రెండో ప్రీఫైనల్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున ప్రతీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు వచ్చిన సందేహాలను ఉపాధ్యాయులు నివృత్తి చేసి వారిలో పరీక్షలంటే భయాన్ని పోగొట్టాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులను వివిధ సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టి సంతృప్తి వ్యక్తంజేశారు. సెక్టోరియల్ అధికారి నర్సయ్య, ప్రధానోపాధ్యాయులు మోహన్, అశోక్‌వర్మ, సీఆర్పీలు సుధాకర్, మహేందర్, ఉపాధ్యాయులు అరవింద్‌కుమార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



వడ్యాల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

'అక్రమ కేసులకు భయపడం'

నిర్మల్‌చైన్‌గేట్: అధికార దాహంతో బీఆర్ఎస్ నాయకులు తమపై పెడుతున్న అక్రమ కేసులకు భయపడబోమని బీజేపీ సీనియర్ నాయకుడు రావుల రాంనాథ్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాక్‌పట్ల గ్రామ శివారులో అల్లోల గౌతంరెడ్డి కుటుంబసభ్యులకు చెందిన వ్యవసాయక్షేత్రంలోకి అక్రమంగా చొరబడ్డారని పోలీసులు బీజేపీ నాయకులపై అక్రమంగా కేసులు నమోదు చేశారని తెలిపారు. సోన్ మండలం పాక్‌పట్ల గ్రామ శ్మశాన వాటిక నుంచి పుష్కర ఘాట్‌కు వెళ్లే దారిలో మంత్రి తనయుడి పేరిట చేపట్టిన ఫామ్‌హౌస్ కోసం బీటీ రోడ్డు కబ్జా చేశారని ఆరోపించారు. ఉపాధిహామీ నిధులతో చేపట్టిన 20 ఫీట్ల బీటీ రోడ్డులోంచి ఐదు ఫీట్లు కబ్జా చేసి కంచె వేశారని తెలిపారు. ఫామ్‌హౌస్ నిర్మాణంతో గ్రామస్తుల భూములు కబ్జాకు గురవుతున్నాయని పేర్కొన్నారు. ఫామ్‌హౌజ్ ప్రహరీ పూర్తిగా బీటీ రోడ్డుపై నిర్మించారని తెలిపారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకే గ్రామస్తులు, మీడియా సమక్షంలో కబ్జాకు గురైన రోడ్డును పరిశీలించామని పేర్కొన్నారు. మంత్రి తనయుడి ఫామ్‌హౌస్‌లోకి అడుగుపెట్టలేదని తెలిపారు. ఫామ్‌హౌస్ నిర్మిస్తున్న 410 సర్వే నంబర్‌లోగల అసైన్డ్ భూమి నక్కల ముత్తన్న నుంచి మంత్రి కొనుగోలు చేసినట్లు చెప్పారు. మంత్రి హోదాలో ఉన్న వ్యక్తి ప్రభుత్వ భూమిని ఎలా కొనుగోలు చేస్తారని ప్రశ్నించారు. తమపై అక్రమ కేసులు నమోదు చేసిన పోలీసుల మీద హైకోర్టుకు న్యాయ విచారణకు వెళ్తామని వివరించారు. సీనియర్ నాయకుడు అయ్యన్నగారి భూమయ్య, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు సామ రాజేశ్వర్‌రెడ్డి, మెడిసెమ్మె రాజు, పట్టణాధ్యక్షుడు సాదం అరవింద్, దళిత మోర్చా నాయకుడు రాచకొండ సాగర్, నాయకులు అంజుకుమార్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, అప్పాల గణేశ్, కొరిపల్లి శ్రావణ్‌రెడ్డి, అల్లం భాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రావుల రాంనాథ్

7న హోలీ పండుగ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఈనెల 6న కామదహనం, 7న హోలీ పండుగ జరుపుకోవాలని నిర్మల్ పురోహితులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు నిర్ణయం తీసుకున్నట్లు వీహెచ్‌పీ పట్టణాధ్యక్షుడు రవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, పురోహితుల సంఘం సభ్యుడు జస్వంత్‌రావు జోషితో కలిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

తప్పిపోయిన చిన్నారిని కుటుంబీకులకు అప్పగింత



కుటుంబీకులకు అప్పజెప్పుతున్న పోలీసులు

నేరడిగొండ: మండల కేంద్రంలో శనివారం వారసంతో ఓ చిన్నారి తప్పిపోయింది. స్థానికులు ఆ చిన్నారిని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. రాకేష్‌-నిషాల కూతురిగా నిర్ధారణ చేసిన పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. కాగా మండల ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి చిన్నారిని వాట్సాప్‌లో చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు.

యువతి అదృశ్యం

నిర్మల్‌టౌన్‌: జిల్లా కేంద్రంలోని రామ్‌రావు బాగ్‌కు చెందిన యువతి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు శనివారం పట్టణ పోలీసులను ఆశ్రయించారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఇటీవలే యువతికి వివాహం కుదిరింది. రెండు రోజుల క్రితం జరగాల్సిన నిశ్చితార్థం ఆగిపోయింది. యువతి పనిచేస్తున్న కార్యాలయం సమీపంలో వ్యాపారం నిర్వహిస్తున్న వంశీకృష్ణ దంపతులతో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో వారిద్దరూ ఆమెతో చనువు పెంచుకుని యువతిని ట్రాప్ చేశారు. ఇదే క్రమంలో వారు కావాలని ఆమె నిశ్చితార్థాన్ని రద్దు చేశారు. దీంతో సదరు యువతి మనస్తాపానికి గురై ఉత్తరం రాసి ఇంట్లోంచి వెళ్లిపోయింది. ఘటనకు కారణమైన వంశీకృష్ణ దంపతులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు వంశీకృష్ణ దంపతులను అరెస్టు చేసి ప్రిన్సిపల్ జడ్జి ఎదుట హాజరుపరిచారు. జడ్జి తీర్పు అనంతరం వారిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మల్లేశ్ తెలిపారు.

తల్లీకొడుకు అదృశ్యం

భైంసారూరల్‌: కుంటాల మండలంలోని అబుగాం గ్రామానికి చెందిన భోజాబాయి, తన కుమారుడు భరత్‌వాజ్‌లు అదృశ్యమైనట్లు భైంసా రూరల్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. భోజాబాయి, తన కుమారుడు భరత్‌వాజ్ కుతురు ప్రణాళిని తీసుకుని పుట్టింటికి గత నెల 23న వచ్చింది. ఇంట్లో కుటుంబీకులు లేకపోవడంతో కుతురు ప్రణాళిని పుట్టింటి వద్ద ఉంచి అమ్మమ్మ వస్తుందని చెప్పి కుమారుడిని తీసుకుని వెళ్లిపోయింది. అప్పటి నుంచి తల్లీ కొడుకులు కనిపించకపోవడంతో కుటుంబీకులు గాలిస్తున్నారు.

అడవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న అధికారులు

కడెం: అడవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఖానాపూర్, జన్నారం ఎఫ్‌డీవోలు కోటేశ్వర్‌రావు, మాధవరావు అన్నారు. శనివారం మండలంలోని ఉడుంపూర్ ఆటవీ రేంజ్ పరిధిలోని కల్లుకుంట వద్ద కెరమెరి, ఆసిఫాబాద్, ఖానాపూర్, జన్నారం, ఇందన్‌పల్లి, బీర్సాయిపేట్, ఉట్నూర్, ఉడుంపూర్, కడెం, ఆటవీ రేంజ్‌ల సిబ్బందితో క్లస్టర్ బార్డర్ ప్రొటెక్షన్ మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. కలప అక్రమ రవాణను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అడవుల సంరక్షణ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇందులో ఎఫ్ఆర్వోలు అనిత, అప్పలకొండ, గులాం మెయినోద్దిన్, అనిత, హఫీజొద్దిన్, శశిధర్‌బాబు, డీఆర్వోలు ప్రకాష్, సిద్ధార్థ, ప్రకాష్ ఉన్నారు.



అటవీ అధికారుల బృందం

గొల్లఘాట్ అటవీ ప్రాంతంలో మంటలు

తాంసి: భీంపూర్ మండలంలోని గొల్లఘాట్ గ్రామశివారులోని అటవీ ప్రాంతంలో శనివారం మంటలు అంటుకుని గ్రామానికి సమీపం వరకు వ్యాపించాయి. అప్రమత్తమైన గ్రామస్తులు వెంటనే మంటలను అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది. ప్రస్తుతం పంటచేన్లలో ఉన్న పత్తి కర్రలను రైతులు తగులబెట్టే క్రమంలో నిప్పురవ్వలు చేలరేగి మంటలు అటవీ ప్రాంతంలోకి వ్యాప్తి చెంది ఉండొచ్చని పలువురు భావిస్తున్నారు.



అడవిలో మంటలు

సోఫాలో మీడియా..!



- సోషల్ మీడియా ఖాతాల నిర్వహణ
- ప్రజాప్రతినిధులు, నాయకుల ప్రత్యేక దృష్టి
- కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు పోస్టులు

సండే స్పెషల్

సాక్షి, మంచిర్యాలడెస్క్‌: సోషల్ మీడియాకు ఉన్న క్రేజీ అంతా ఇంతా కాదు. ఫేస్‌బుక్.. ఇన్‌స్టాగాం.. ట్విట్టర్ ఇలా ఏదో ఒక వేదికగా చాలామంది సో షల్ మీడియాలో ఖాతాలు నిర్వహిస్తున్నారు. ఒక్కో వ్యక్తి రోజులో సగటున రెండున్నర గంటలు సామాజిక మాధ్యమాలపై గడుపుతున్నారు. అందుకే సోషల్ మీడియా అనేది సమాచార వ్యాప్తికి ప్రధాన వారధిగా మారింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ప్రధాన పార్టీల నాయకులు సోషల్ మీడియా ఖాతాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. రోజువారీగా కార్యక్రమాలు, పర్యటనలు ఫొటోలతో పోస్టు చేయిస్తున్నారు.

ప్యాకేజీ..

సోషల్ మీడియాలో పండుగలు, నాయకుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు, శుభాకాంక్షలు తెలియజేయడం, ప్రభుత్వ పథకాలపై పోస్టుల కోసం ప్యాకేజీతో కొందరు పని చేస్తున్నారు. ఆయా కార్యక్రమాల సమయంలో ప్రజాప్రతినిధుల ఫొటోలతో డిజైన్ చేసి ఇస్తుంటారు. ఏడాదికి ప్యాకేజీ రూ.2.50లక్షల వరకు చెల్లిస్తున్నట్లు సమాచారం.

ప్రత్యేక సిబ్బంది

ఉమ్మడి జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, వచ్చే ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్న నాయకుల వద్ద సోషల్ మీడియా ఖాతాల నిర్వహణ కోసం ప్రత్యేక సిబ్బంది పని చేస్తున్నారు. ఒక్కొక్కరి వద్ద ఇద్దరు నుంచి ముగ్గురు ఉన్నా రు. వ్యక్తిగత పీఆర్‌వోలు, పీఏలుగా వ్యవహరిస్తున్నారు. వీరికి కనిష్ఠంగా రూ. 15వేల నుంచి గరిష్ఠంగా రూ.30వేల వరకు వేతనం చెల్లిస్తున్నారు. అభివృద్ధి పనులు, సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న సమయంలో ఫొటోలు, ఆ అంశానికి సంబంధించిన సమాచారం పోస్టు చేయడమే వీరి పని. కొంతమంది ప్రజాప్రతినిధులకు సంబంధించిన వారు హైదరాబాద్ నుంచి ఖాతాల నిర్వహణ చూస్తున్నారు. ఇక్కడున్న వారు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తుంటారు. ఫొటోలు తీయడానికి ప్రత్యేకంగా ఫొటోగ్రాఫర్లు కూడా ఉన్నారు.

పార్టీల్లో సోషల్ మీడియా కమిటీలు

బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ సోషల్ మీడియా కమిటీలు కూడా వేశాయి. మండలం, నియోజకవర్గాల వారీగా కన్వీనర్లు, కోఆర్డినేటర్లుగా ఉన్నారు. ఆయా పార్టీల కార్యకర్తలు స్వచ్ఛందంగా పని చేస్తున్నారు. తమ తమ పార్టీల విధానాలను ప్రచారం చేస్తూనే ప్రత్యర్థి పార్టీలను ప్రశ్నిస్తున్నారు.

కొత్త పంథా..

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్న ఆదిలాబాద్ జిల్లాలోని ఓ ఎన్‌ఆర్‌ఐ ప్రత్యేకంగా రెండు టీవీ చానళ్లనే తీసుకొచ్చారు. జిల్లాతోపాటు మరికొన్ని జిల్లాల్లో ఈ చానళ్ల ప్రసారాలు వస్తున్నాయి. ప్రధానంగా ఆయనకు సంబంధించిన కార్యక్రమాలు ప్రసారం చేస్తూనే మరికొన్ని ప్రసారాలు వస్తుంటాయి.

- నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రతిపక్ష పార్టీ నాయకుడు సోషల్ మీడియాలో ఖాతాల నిర్వహణపై అంతగా దృష్టి సారించకున్నా.. తనదైన శైలిలో మూడు, ఆరు నెలలకోసారి సర్వే చేయిస్తుంటారు. తన కార్యక్రమాలు, ప్రజల స్పందన ఎలా ఉందనే వాటిపై ఆరా తీస్తుంటారు. అందుకు అనుగుణంగా తన ప్రణాళిక మార్చుకుంటున్నారు.

కమ్యూనిస్టు పార్టీలూ...

తూర్పు జిల్లాలో కమ్యూనిస్టు పార్టీల నాయకులూ సోషల్ మీడియాలో చురుగ్గానే ఉన్నారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లోని సీపీఎం, సీపీఐ నాయకులు, కార్మిక సంఘాల నాయకులు కార్యకలాపాలను సామాజిక మాధ్యమాల వేదికగా ప్రచారం చేస్తున్నారు.

ఖాతాల్లో అనుసరణ ఇలా..

	Facebook	Twitter
చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్	1,19,000	1,91,000
మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి	73000	39,300
మంచిర్యాల ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు	23,000	12,400
ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న	16000	14,200
బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు	8,200	2,016
సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప	45,000	5,524

ప్రజాప్రతినిధులు/నాయకుల ఫేస్‌బుక్‌లో ఫాలోవర్లు

ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు	13,000
బీజేపీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్	3,200
బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య	2,400
కాంగ్రెస్ నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి	62,000
ముధోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి	6,100
మంచిర్యాల బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి	33,000
మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు	13,000
ఆదిలాబాద్ బీజేపీ నాయకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి	51,000

ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తాం



ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ఆధ్వర్యంలో చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతోపాటు బీఆర్‌ఎస్ పార్టీకి సంబంధించిన కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తాం. ఆదిలాబాద్ మున్సిపాల్టీతోపాటు నియోజకవర్గంలోని మావల, బేల, జైనథ్, ఆదిలాబాద్ రూరల్ మండలాల బీఆర్‌ఎస్ శ్రేణులకు సమాచారం చేరవేస్తాం. ఫేస్‌బుక్, వాట్సాప్‌లో ప్రచారం చేస్తూ పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్నాం.

– ప్రశాంత్, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి, ఆదిలాబాద్

కార్యక్రమాలు తెలియజేస్తాం..



సోషల్ మీడియాను ఎక్కువగా వినియోగిస్తుంటాం. మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావుకు సంబంధించి పార్టీ కార్యక్రమాలను మీడియా, సోషల్ మీడియాలో పంపించే బాధ్యతలు చూస్తున్నాను. పార్టీ అధిష్ఠాంతోపాటు ప్రభుత్వ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సోషల్‌మీడియా ద్వారా పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతిధులకు చేరవేస్తుంటాను.

– దాసరి సాయికృష్ణ, మంచిర్యాల నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్

ప్రజల నుంచి సానుకూల స్పందన



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరు, ప్రజావ్యతిరేక విధానాలపై సోషల్ మీడియాలో పోస్టు చేస్తుంటా ను. ప్రజల నుంచి సానుకూల స్పందన లభిస్తుంది. నియోజకవర్గంలో ప్రత్యర్థి పార్టీల నాయకుల విధానాలు, వారిపై వస్తున్న వ్యతిరేకతను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తుంటాను. పార్టీ విధానాలను ప్రజల్లోకి తీ సుకెళ్లడానికి సోషల్ మీడియా ఉపయోగపడుతుంది.

– వేల్పుల రోహిత్, కాంగ్రెస్ పార్టీ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్

రోడ్డు ప్రమాదంలో కూతురు మృతి.. తండ్రికి గాయాలు

- బైక్‌ను ఢీకొన్న ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు
- ఆరోగ్యం బాగాలేక తండ్రితో ఇంటికి వస్తుండగా ఘటన
- ఉద్యోగం వచ్చిన మూడు నెలలకే..



కల్పన (ఫైల్)

సారంగపూర్‌: కుటుంబాన్ని పోషించేందుకు ఆ కుటుంబం వలస వచ్చింది. తండ్రి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తండ్రి కష్టాన్ని గుర్తించిన కూతురు క ష్టపడి చదువుకుని మూడు నెలల క్రితమే ఉద్యోగం సాధించింది. ఆరోగ్యం బాగులేక ఇంటికి తండ్రితో కలి సి వస్తుండగా ఓ ప్రైవే ట్ పాఠశాల బస్సు ఢీ కొనగా సంఘటన స్థ లంలోనే మృతిచెందింది. ఈ విషాద సంఘటన శనివారం చోటుచేసుకుంది.

ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లోని ఈద్‌గాం గ్రామంలో పోస్ట్‌మాస్టర్‌గా రాథోడ్ కల్పన (19) పనిచేస్తోంది. కుటుంబ సభ్యులు గతంలో కుంటాల మండలంలోని ఓలా గ్రామానికి వలస వచ్చారు. ఇక్కడే తండ్రి రాథోడ్ దత్తురాం ఓ రైస్‌మిల్లులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో మూడు నెలల క్రితమే కూతురు కల్పనకు తపాలా శాఖలో బీపీఎంగా ఉద్యోగం వచ్చింది. కూతురి ఆరోగ్యం బాగోలేక తండ్రి తీసుకురావడానికి కాగజ్‌నగర్ వెళ్లాడు. తిరిగి ఇంటికి బైపాస్ మీదుగా మహబూబాఘాట్స్ నుంచి బైక్‌పై వస్తుండగా గోపాల్‌పేట్ ఎక్స్‌రోడ్డు మూల మలుపు వద్ద ఎదురుగా వచ్చిన ఓ ప్రైవేటు పాఠశాల బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో కల్పన ఎగిరిపడి తలకు గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. తండ్రి దత్తురాంకు తీవ్ర గాయాలు కాగా ప్రస్తుతం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుటుంబానికి కుమారుడిలా చేదోడువాదోడుగా నిలిచే కుమార్తె మృతి చెందడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వసంత్ తెలిపారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం

నిర్మల్‌టౌన్‌: జిల్లా కేంద్రంలోని కంచరోని చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పట్టణ సీఐ మల్లేశ్ తెలిపారు... శనివారం చెరువులో మృతదేహం గుర్తించిన స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి పరిశీలించారు. మృతుడి వయసు సుమారుగా 40ఏళ్ల వరకు ఉండొచ్చని, మృతదేహంపై బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్, రోల్డ్ గోల్డ్ చైన్ ధరించి ఉన్నాడని వివరించారు. ఆచూకీ తెలిస్తే పట్టణ సీఐ 8712659511, ఎస్సై 7013857446 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

కుక్కల దాడిలో జీవాలు మృతి

లోకేశ్వరం: మండలంలోని సేవాలాల్‌తండా గ్రా మంలోని ఈరాలాల్‌కు చెందిన రెండు మేకలు, రెండు గొర్రెలు శనివారం తెల్లవారు జామున కుక్కలు దాడిలో మృతిచెందాయి. బాధితుడు ఈరాలాల్ వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం ఇంటి సమీపంలోని పాకలో ఉంచాడు. తెల్లవారు జామున మేకలు అరవడంతో బయటకు వచ్చేసరికి కుక్కల దాడిలో రెండు మేకలు, రెండు గొర్రెలు మృతిచెంది కనిపించాయి. వాటి విలువ సుమారు రూ.25వేల వరకు ఉంటుందని యాజమాని తెలిపారు.

కుక్కదాడిలో ఒకరికి గాయాలు

ఖానాపూర్‌: పట్టణంలోని ఆరో వార్డు పరిధిలోని సాయినగర్ కాలనీకి చెందిన బడుగు భీమక్క అనే వృద్ధురాలిపై ఊరకుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వృద్ధురాలిని ఆస్పత్రికి తరలించారు

జిల్లాకు సివిల్ సర్వీసెస్ ట్రైనీ అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్‌: ఇండియన్ స్టాటికల్ సర్వీసెస్, ఇండియన్ ఎకనామికల్ సర్వీసెస్ విభాగానికి చెందిన సివిల్ సర్వీసెస్ ట్రెయినీ ఫౌండేషన్ కోర్స్ శిక్షణలో భాగంగా 21మంది శనివారం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్ వరుణ్ రెడ్డితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జిల్లాలో చేపట్టిన పనుల, ఏ ఏ శాఖ ద్వారా ఏ పనులు జరుగుతున్నాయో వీరికి ఆయన వివరించారు. ఆదివారం నుంచి వీరు నాలుగు టీములుగా విడిపోయి ఐదు రోజులు మన జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో విజయలక్ష్మి, జెడ్పీ సీఈవో పాల్గొన్నారు.



కలెక్టర్‌తో సమావేశమైన ట్రైనీ అధికారులు

నచ్చన్‌ఎల్లాపూర్‌లో..



నచ్చన్‌ఎల్లాపూర్ జీపీ కార్యాలయం వద్ద

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలో ట్రెయినీ సివిల్ సర్వీసెస్ అధికారులు పర్యటించారు. ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్(ఐఎస్ఎస్), ఇండియన్ ఎకానమిక్ సర్వీస్ (ఈఎస్ఎస్)కు చెందిన సందీపన్ సర్కార్, బంటి కుమార్, ఆలీషా ఖానం, ప్రీతంసేన్, సౌమ్య బుదిరాజా ఉన్నారు. సర్పంచ్ బొడ్డు గంగన్న గ్రామాభివృద్ధి పనులు వివరించి సన్మానించారు. ఇందులో ఎంపీడీవో లింబాద్రి, తహసీల్దార్ చిన్నయ్య, ఎంపీవో వెంకటేశ్, ఏపీఎం రాజారాం, ఏపీవో జయదేవ్ ఉన్నారు.

పార్‌పెల్లికి ట్రైనీ ఐఈఎస్, ఐఎస్ఎస్‌లు..



పార్‌పెల్లి జీపీ వద్దకు చేరిన ట్రైనీ ఐఈఎస్,ఐఎస్ఎస్‌లు

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి గ్రామాన్ని ట్రెయినీ ఐఈఎస్, ఐఎస్ఎస్‌లు పరిశీలించారు. వీరు ఇక్కడ ఈ నెల 10వరకు ఉండనున్నారు. వీరికి ఎంపీడీవో మోహన్, ఎంపీవో నసీరుద్దిన్ స్వాగతం పలికారు. పార్‌పెల్లి గ్రామ పంచాయతీలో వీరికి బస ఏర్పాటు చేశారు. ఇందులో సైఫ్ అలీ, వీణసింగ్, మీనా, రాహుల్ సింగ్, భావన జోషి ఉన్నారు. ఇందులో ఎంపీడీవో మోహన్, ఎంపీవో నసీరుద్దీన్, సర్పంచ్ రాజేందర్ ఉన్నారు.

ఎర్వచింతల్ గ్రామానికి..



ఎర్వచింతల్ గ్రామానికి వచ్చిన అధికారులు

ఖానాపూర్‌: మండలంలోని ఎర్వచింతల్ గ్రామానికి ఆరుగురు మహిళ ట్రైనీ అధికారుల బృందం చేరుకుంది. ఇండియన్ ఎకానమి సర్వీస్‌కు చెందిన ముగ్గురితో పాటు ఇండియన్ స్టాటికల్ సర్వీస్‌కు చెందిన ముగ్గురు ఉన్నారు. వీరికి గ్రామంలోని పంచాయతీ భవనంలో ఎంపీడీవో మల్లేశ్, సర్పంచ్ కొడారి గోపాల్, ఎంపీటీసీ వాల్‌సింగ్‌ల ఆధ్వర్యంలో బస ఏర్పాటు చేశారు. ప్రభుత్వాల పథకాలు, ప్రజల స్థితిగతులు, తదితర విషయాలపై అధ్యయనం చేస్తారని ఎంపీడీవో తెలిపారు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య



సాయన్న (ఫైల్)

లోకేశ్వరం: మండలంలోని రాజూర గ్రామానికి చెందిన అడ్డిగా సాయన్న (70) ఉరేసుకుని శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సాయికుమార్ వివరాల ప్రకారం ... సాయన్న కొంత కాలంగా కాలేయా వ్యాధితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రులు తిరిగినా వ్యాధి నయం కాలేదు. అయితే రెండ్రోజుల నుంచి నొప్పి తీవ్రం కావడంతో జీవితంపై విరక్తితో శనివారం తన తోటలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు సాయన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

తానూరు: మండల కేంద్రానికి చెందిన జింకల్‌కర్ మాధవ్‌రావ్(45) శనివారం పాత ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మాధవ్‌రావ్‌కు ఇద్దరు కుమార్తెలు. వారి పెళ్లి చేయడానికి ఆర్థిక స్తోమత లేక భార్య లలితాబాయితో వాపోయేవాడు. ఈ క్రమంలో మూడు నెలలుగా తాగుడికి బానిసయ్యాడు. శనివారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పాత ఇంటికి వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

జేబుదొంగ పట్టివేత

నిర్మల్‌టౌన్‌: జిల్లా కేంద్రంలోని బస్‌స్టేషన్‌లో బోథ్ పాయింట్ వద్ద బస్సు ఎక్కుతున్న ప్రయాణికుడి జేబు కట్ చేస్తుండగా శనివారం విధుల్లో ఉన్న కంట్రోలర్ మహేందర్‌రెడ్డి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు చేరుకుని దొంగను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.